



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఈవో

పది విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 3 : జిల్లాలోని పదోతరగతి విద్యార్థులకు శనివారం ప్రతిభాపాటవ పోటీలను నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఈవో రవీందర్‌రెడ్డి, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి హాజరయ్యారు. జిల్లా ఫోరమ్ అధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా భూషణ్ ఎన్నికయ్యారు. విజేతలకు బహుమతులను అందించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సౌజన్యంతో నిర్వహించిన పోటీలకు పరీక్షల నిర్వహణ జిల్లా ఇన్‌చార్జి పద్మ పాల్గొన్నారు.

'చెకుముకి' లో సత్తా చాటిన విద్యార్థులు

కుంటాల, ఫిబ్రవరి, 3 : జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలలో మండల కేంద్రం కుంటాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించి సత్తా చాటారు. బి.శారద రుతిక (పదవ తరగతి), వినాయక్ (9వ తరగతి), విష్ణువర్ధన్ (10వ తరగతి) ముగ్గురు ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించి డీఈవో రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల తరపున సిబ్బంది వారిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పరీక్షకు కుభీర్ పాఠశాల విద్యార్థులు

కుభీర్, ఫిబ్రవరి 3 : చెకుముకి సైన్సు సంబరాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి పరీక్షలో ప్రతిభ కనబరిచి కుభీర్‌లోని ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు జే.సాయన్న తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కే.అక్షయ, 9వ తరగతి చదువుతున్న ఏ.పవన్, 8వ తరగతి చదువుతున్న ఎస్.ధనశ్రీలు రాష్ట్రస్థాయి చెకుముఖి పరీక్షకు ఎన్నికయినట్లు తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు, పోషకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

నిర్మల్ కల్చరల్ : జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు చెకుముకి పోటీలు నిర్వహించారు. డీఈవో ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రంపై అవగాహన కల్పించాలని, సృజనాత్మక శక్తి పెంపొందించి సమస్యల పరిష్కార అన్వేషణ జరగాలన్నారు. వక్త డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ వర్మ, ఆకుల సుదర్శన్, కే. రాములు, సల్ల పోశెట్టి, జి. నర్సయ్య పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్‌లో నర్సారెడ్డి సంస్మరణ సభ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : మాజీ పీసీసీ అధ్యక్షుడు, మంత్రి స్వర్గీయ పి. నర్సారెడ్డి సంస్మరణ సభ సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఇందిరా హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అగ్రనాయకులు ఈ సభకు హాజరుకానున్నట్లు తెలిపారు. నర్సారెడ్డి అభిమానులు, పార్టీ శ్రేణులు ఈ సభకు హాజరు కావాలని కోరారు.

మాడేగాం గ్రామ పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 3 : మండలంలోని మాడేగాంలో పదవీకాలం ముగిసిన గ్రామ పంచాయతీ పాలక వర్గానికి శనివారం గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. సర్పంచ్ సరిత రాజు, ఉప సర్పంచ్ మారుతిరావు పటేల్, ఇతర పాలక సభ్యులను పంచాయతీ కార్యదర్శి సునీల్, కదిలే దేవస్థానం చైర్మన్ వెంకట్‌రావుపటేల్ సన్మానించి వీడ్కోలు పలికారు.

సీఎంఆర్ రికవరీపై కొరడా



చించోలి (బి)లో రైస్‌మిల్లును సీజ్ చేస్తున్న అధికారులు

- జిల్లాలో మొదలైన రైస్‌మిల్లుల తనిఖీలు
- గడువు ముగిసినా.. స్పందించని రైస్ మిల్లర్లు
- మిల్లర్ల వద్ద ఇంకా 1,03,716 లక్షల ఎంటీఎస్‌ల సీఎంఆర్
- సారంగాపూర్ మండలంలోని చించోలి(బి)లోని రైస్‌మిల్లుకు తాళం
- మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసిన అధికారులు
- మున్ముందు మరింత సీరియస్‌గా తనిఖీలు

నిర్మల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ ధాన్యం విషయంలో రైస్‌మిల్లుల యాజమాన్యాలపై పౌరసరఫరాలశాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ముఖ్యంగా 2022-2023 రబీసీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ విషయంలో రైస్‌మిల్లర్లు సర్కారు హెచ్చరికలను ధిక్కరించడమే కాకుండా గడువులోగా కూడా సీఎంఆర్‌ను సర్కారుకు అప్పగించలేదు. జిల్లాలోని 47 రైస్‌మిల్లులు ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిగా ఉన్నాయి. అయితే ఇప్పటికే పలుసార్లు ప్రభుత్వం సీఎంఆర్ రికవరీ విషయంలో హెచ్చరికలు జారీ చేసినప్పటికి రైస్‌మిల్లర్ల నుంచి స్పందన కనిపించలేదు. దీంతో ప్రభుత్వం జనవరి 31వ తేదీ వరకు మరోసారి గడువును పొడగించింది. అయినప్పటికి రైస్‌మిల్లర్లు ఈ గడువును ఖాతరు చేయకుండా ఎప్పటి మాదిరిగానే వ్యవహరించారు. మొత్తం జిల్లాలో 1,58,566.320 ఎంటీఎస్‌ల ధాన్యాన్ని సేకరించారు. అయితే దీని కోసం గానూ 1,06,831.956 ఎంటీఎస్‌ల సీఎంఆర్‌ను రైస్‌మిల్లులు సర్కారుకు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం 3116 ఎంటీఎస్‌ల సీఎంఆర్‌ను మాత్రమే ప్రభుత్వానికి అప్పజెప్పారు. మిగతా 1,03,716 లక్షల ఎంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పాల్సి ఉంది. ఇప్పటికి కూడా మొన్నటి ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి సీఎంఆర్ రూపంలో అందించాలి. అయితే 2022-2023 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ విషయంలో రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి అటు అధికారులను ఇటు ప్రభుత్వాన్ని బురిడి కొట్టిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికి రైస్‌మిల్లర్లు మాత్రం ఆ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. తమకున్న రాజకీయ పలుకుబడి, అధికారిక అండదండలతో కొంతమంది రైస్‌మిల్లర్లు ఉన్నతాధికారుల హెచ్చరికలను సైతం పట్టించుకోవడం లేదంటున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లా కలెక్టర్ సైతం సీఎంఆర్ విషయంలో సమీక్ష జరిపి గడువులోగా బియ్యాన్ని అప్పగించాలంటూ హెచ్చరించారు. అయితే రైస్‌మిల్లర్లు కలెక్టర్ హెచ్చరికలను సైతం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మొదటి నుంచి జిల్లాలోని కొంతమంది రైస్‌మిల్లు యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి సీఎంఆర్ విషయంలో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులున్నాయి. అయితే వీరిపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకునేందుకు కూడా వెనకాడుతున్నారు. ఈ క్రమంలో 2022-2023 రబీసీజన్‌కు సంబంధించి గడువు ముగిసిన కారణంగా కలెక్టర్ మరోసారి కఠినచర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగానే శనివారం నిర్మల్‌లోని పలు మిల్లులను పౌర సరఫరాలశాఖ అధికారులు తనిఖీలు చేసి కొరడా ఝులిపించారు. ఇందులో భాగంగానే సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామంలో గల శ్రీ సాయి రైస్‌మిల్లును అధికారులు సీజ్ చేశారు. సంబంధిత యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే సదరు రైస్‌మిల్లు యజమాని పెద్దమొత్తంలో ధాన్యం సంచులను నిర్లక్ష్యంగా ఆరుబయటనే నిల్వ చేయడంతో ఆ ధాన్యమంతా చెడిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఈ చెడిపోయిన ధాన్యం మిల్లింగ్ చేయడం కూడా కష్టమేనంటున్నారు. అయితే దీనికి బాధ్యులు ఎవరు అన్న సందేహాలు నెలకొంటున్నాయి. ఇదంతా పథకం ప్రకారమే జరిగిందంటూ అధికారులు సదరు రైస్‌మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. గత కొంత కాలం నుంచి పలుకుబడి, పరపతి గల రైస్‌మిల్లర్లు సీఎంఆర్‌ను అనుకూలంగా మలుచుకొని పెద్దమొత్తంలో అవకతవకలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలునాయి. ఈ వ్యవహారం అధికారులకు తెలిసినప్పటికీ మిల్లర్ల ఒత్తిళ్ల కారణంగా ఇప్పటి వరకు వారు చర్యలు తీసుకునేందుకు వెనకాడారంటున్నారు. అయితే ప్రస్తుత కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సీఎంఆర్ విషయంలో కఠినవైఖరి అవలంభిస్తుండడం కొంతమంది రైస్‌మిల్లర్లకు సంకటంగా మారింది. సీఎంఆర్ రికవరీ విషయంలో కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఇక రైస్‌మిల్లులపై వరుస దాడులు చేపట్టేందుకు రంగం సిద్దం చేశారు.

ఇక ముమ్మర తనిఖీలకు రంగం సిద్ధం

కాగా సీఎంఆర్ బియ్యం అప్పగింత గడువు ముగిసిపోవడంతో అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగారు. 2022-2023 రబీసీజన్‌కు సంబంధించి మొత్తం 47 రైస్‌మిల్లుల వద్ద ఉన్న 1,25,266 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేయలేదన్న ఆరోపణలున్నాయి. ఈ లెక్కప్రకారం 1,03,716 లక్షల ఎంటీఎస్‌ల సీఎంఆర్‌ను సర్కారుకు రైస్‌మిల్లు యజమాన్యాలు అప్పగించాల్సి ఉంది. అయితే ఇప్పటికే పలుసార్లు గడువును పొడగించినప్పటికీ రైస్‌మిల్లర్లు మాత్రం ఈ గడువునే కాకుండా అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ రికవరీ అంశాన్ని పట్టించుకోలేదంటున్నారు. ప్రభుత్వం సైతం గడువు పెంపు విషయంలో పలుసార్లు అవకాశం ఇచ్చినప్పటికీ రైస్‌మిల్లర్లు మాత్రం సీఎంఆర్ విషయంలో మొండివైఖరిని అవలంభిస్తూ వచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ విషయంలో కఠిన వ్యవహరించేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ దిశగా కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగానే మొట్టమొదట సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామం వద్ద గల శ్రీ సాయి రైస్‌మిల్లును సీజ్ చేయడమే కాకుండా సంబంధిత మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో అంతటా కలకలం మొదలైందంటున్నారు.

రికవరీ పూర్తయ్యేనా..?

ఇదిలా ఉండగా జిల్లాలోని 47 రైస్‌మిల్లులు 2022-2023 రబీ సీజన్‌కు సంబందించి సీఎంఆర్ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి సీఎంఆర్ రికవరీ విషయంలో రైస్‌మిల్లర్లు మొండి వైఖరిని అవలంభిస్తూ కోట్ల రూపాయల అవకతకలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికే దీనిపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తడమే కాకుండా జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు అందాయి. అయితే కలెక్టర్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని తనిఖీలు చేపట్టాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పాటు కలెక్టర్ స్వయంగా కొన్ని రైస్‌మిల్లులను తనిఖీ చేసి స్టాక్ రిజిస్ట్రార్‌లను అలాగే నిల్వ ఉంచిన ధాన్యం వివరాలను పరిశీలించారు. దీని కారణంగా ఇక సీరియస్ చర్యలు తీసుకునేందుకు ఆయన రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే అధికారులు ఇక రైస్‌మిల్లులను వరుసగా తనిఖీలు చేసేందుకు కార్యచరణ రూపొందించారు. మరో వారం పది రోజుల్లోగా అన్ని రైస్‌మిల్లులను తనిఖీ చేసి అవకతవకలను వెలికి తీసేందుకు సిద్ధమవుతున్నారు. అధికారుల సీరియస్ చర్యలతో రైస్‌మిల్లర్లు ముందు జాగ్రత్త చర్యలకు శ్రీకారం చుట్టారు.

పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూమన్న

పెంబి, ఫిబ్రవరి 3 : పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్యకర్తలు రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అధికసీట్లు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు తులాల సదాశివ్, బీజేపీ నాయకులు ఐదు వెంకటేష్, నాగరాజ్, అంగ నర్సయ్య, పుప్పాల రవి, లక్ష్మీనారాయణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గావ్ చలో అభియాన్' : బీజేపీ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 3 : ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించేందుకు సోమవారం నుంచి ఈ నెల 8వరకు గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాయకులు గ్రామాలకు వెళ్లి వివరించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. మండల అధ్యక్షుడు తోకల అనిల్, నాయకులు లవ కుమార్ గౌడ్, కార్యక్రమ కన్వీనర్ నర్సారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కుంటాలలో కార్యకర్తలలో మాట్లాడుతున్న నాయకులు

కుంటాల, ఫిబ్రవరి, 3: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని కుంటాల మండల భారతీయ జనతా పార్టీ నాయకులు గుద్దేటి నర్సయ్య అన్నారు. శనివారం కుంటాలలో గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యకర్తలు ప్రతీ గ్రామానికి వెళ్లి మోదీ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రతీ పథకం గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించి.. నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధాన మంత్రి అయ్యేందుకు ప్రతీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 3 : జిల్లాలోని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు వేసవిలో కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దాసరి అనసూయ, సీతక్కకు వివరించారు. మంత్రి శనివారం గ్రామ పంచాయతీ పాలనపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఫిబ్రవరి 7 నుండి 15 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా రూపకల్పన దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తాగునీరు సరఫరా కాని గ్రామాలను గుర్తించి నీటి సరఫరా జరిగేలా చూస్తామన్నారు. అవసరమైన కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు. నూతన పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ విజయవంతం చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పంచాయతీ అధికారి శ్రీలత, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో సుధీర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో జిల్లా ప్రథమంగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 3 : పదోతరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యాశాఖను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టర్ సముదాయ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్షల సన్నద్ధతపై సమీక్షించారు. తగు ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది సాధించిన ఫలితాల పట్ల అధికారులను అభినందించారు. ఈ సంవత్సరంలోను అదే స్ఫూర్తి కొనసాగించి ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. 45 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేసి ఉత్తమ ఫలితాలను సాధించేలా కృషి చేయాలన్నారు. 10 జీపీఏ సాధించిన వారి వివరాలతో పాటు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే మెరుగైన వంద శాతం ఫలితాలకు అవకాశం ఉంటుందన్నారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకొని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గణితం, ఆంగ్లం విషయాలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వంద శాతం ఫలితాల సాధనకు ప్రత్యేక పర్యవేక్షణతో విద్యాధికారులు కృషి చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సంవత్సరం 8,923 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు డీఈవో తెలిపారు.

ఎంపీ అభ్యర్థులు రైల్వేలైన్ కోసం బాండ్ రాసివ్వాలి

- నిర్మల్ రైల్వేసాధన సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీ లింగన్న

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 3 : పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులెవరైనా నిర్మల్ మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని ముందుగా బాండ్ పేపర్ రాసిచ్చి, గెలిచిన తర్వాత రైల్వేలైన్ తీసుకురావాలని నిర్మల్ రైల్వేలైన్ సాధన సమితి చైర్మన్, పెన్షనర్స్ సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు తీసుకువస్తానని చెప్పి బాండ్ పేపర్ రాసిచ్చి పోటీ చేశారని చెప్పారు. గెలిచిన తర్వాత ముందు చెప్పినట్లు పసుపు బోర్డు తీసుకువచ్చారన్నారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా పోటీచేసే అభ్యర్థులెవరైనా ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటుకు కృసి చేస్తామని ముందుగా బాండ్ పేపర్ రాసివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గెలిచిన తర్వాత కచ్చితంగా రైల్వేలైన్ తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. ఇటీవల జిల్లాకు చెందిన పలువురు బాధ్యులు డిల్లీ వెళ్లి ప్రస్తుత ఎంపీ సోయం బాపురావును కలిశారని, కానీ ఆయన సరైన స్పందన ఇవ్వకపోవడం సరికాదన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు బండి సంజయ్, అర్వింద్‌లు స్పందించిన తీరుకు ధన్యవాదాలు తెలిపారు. నిర్మల్ మీదుగా రైల్వేలైన్ సాధన కోసం అన్ని వర్గాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. త్వరలోనే ఈ అంశాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ఇందుకు అన్ని పార్టీలు, సంఘాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు సెక్టార్ అధ్యక్షుడు విలాస్, టీఎస్‌జీవోస్ అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, నిర్మల్ రైల్వే సాధన సమితి బాధ్యులు యాటకారి సాయన్న, మూర్తి ప్రభాకర్, నిమ్మ గణేష్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్న వ్యక్తికి నోటీసు జారీ



భవన నిర్మాణ పనులను నిలిపివేస్తున్న అధికారులు దృశ్యం

నర్సాపూర్(జి), జనవరి 3 : మండల కేంద్రంలోని ఊరచెరువుకు వచ్చే కాలువ ప్రభుత్వభూమిని కొందరు ఆక్రమించి భవన నిర్మాణ అనుమతులు పొందక భవనాలు నిర్మిస్తున్నారు. శనివారం ప్రభుత్వ నాలా భూమిపై అక్రమ భవన నిర్మాణ పనులు చేపడుతున్న వ్యక్తికి యంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి నోటీసులు జారీ చేశారు. సర్వే నెంబర్ 51, 52, 53, 58, 59 నెంబర్లు నాలా అనుమతులు పొందారని వెంచర్ నిర్వాహకుడు పదిశాతం భూమిని గ్రామపంచాయతీకి మార్టిగేజ్ చేయకుండానే ఇంటి నిర్మాణాలు చేడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా యంపీవో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇంటినిర్మాణ పనులు చేపడితే నోటీసులు ఇచ్చి అక్రమ కట్టడాలను కూల్చివేస్తామన్నారు. కొత్త పంచాయతీ చట్టం ప్రకారం ఇంటి నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చన్నారు. నది, సరస్సు, చెరువు, నాలా వంటి నీటి వనరులలో ఎలాంటి నిర్మాణ కార్య కలాపాలు అనుమతించమన్నారు. ఇరిగేషన్‌శాఖా ఇంజనీర్ సోన్‌కాంబ్లే గంగాధర్ చెరువు కాలువను పూడ్చినవారిపై చర్యలు తీసుకోవాలని గతంలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కొందరు వెంచర్ నిర్వాహకులు కాలువలను పూడ్చివేసి ప్లాట్లుగా మారుస్తున్నారని ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించాలన్నారు.

రోడ్డు భద్రతపై

అవగాహన పెంచుకోవాలి

- ఏఎస్పీ కాంతిలాల్ పటేల్



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసా రూరల్, ఫిబ్రవరి 3 : రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ప్రజలకు సూచించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం ప్రతీఒక్కరూ వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని అదేవిధంగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమావళిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు, ఎస్సై శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ముథోల్, ఫిబ్రవరి 3 : రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ముథోల్ ఎస్సై సాయికిరణ్ అన్నారు. శనివారం రోడ్డుభద్రత మహోత్సవాల్లో భాగంగా ముథోల్‌లో ఆటోడ్రైవర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డుప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతుందన్నారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతీ ఒక్కవ్యక్తి రూల్స్‌ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఈ రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడుపకూడదని, అతివేగం, ఫోన్ మాట్లాడుతూ... డ్రైవింగ్ చేయకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని ప్రతి వాహనదారుడు డ్రైవిగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సుదర్శన్ బుద్ధ, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 3 : టీఎన్జీవో అధికారుల ఫోరమ్ క్యాలెండర్ శనివారం అధ్యక్షుడు ప్రభాకర్ ఆవిష్కరించారు. నాయకుడు రవికుమార్, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి జే. పరుశరాం, ఫోరమ్ అధ్యక్షుడు భూమేశ్వర్, జనరల్ సెక్రటరీ ఎక్బాల్ అహ్మద్, షాలిని, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి'


రైతులకు సూక్ష్మ నీటిసేద్యం పరికరాలను అందిస్తున్న అధికారులు

పెంబి, ఫిబ్రవరి 3 : మండలంలో పంటలు ఎక్కువగా వర్షాధారంగా సాగవుతున్నాయని, కాబట్టి రైతులు తమకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకునేందుకు సూక్ష్మ నీటిసేద్యం పరికరాల ఉపయోగాన్ని విస్తృతం చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో రిలయన్స్ ఫౌండేషన్, సీఆర్డీ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎంపీడీవో సుధాకర్ చేతుల మీదుగా రైతులకు సూక్ష్మ నీటి సేద్యం పరికరాలను, మేకల పెంపకందారులకు షెడ్‌నెట్‌లను, కుట్టుమిషన్‌లో శిక్షణ తీసుకుని ఉన్న యువతులకు టైలరింగ్ పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ.. మండల పరిధిలో సాగు నీటి కొరత సమస్య ఎక్కువగా ఉందన్నారు. వర్షాకాలంలో సుమారుగా పదహారు వేల ఎకరాలు సాగులో ఉండగా.. రబీలో కేవలం ఆరు వేల ఎకరాలు మాత్రమే సాగవుతున్నట్లు తెలిపారు. సాగునీటి సమస్యను అధిగమించేందుకు గాను గత ఐదు సంవత్సరాలుగా వ్యవసాయశాఖ ద్వారా సూక్ష్మ నీటి పరికరాలపై రైతులకు విరివిగా అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో ఉద్యానశాఖ ద్వారా ఎంఐపీ పథకంలో భాగంగా మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు సుమారుగా 60 వరకు స్ప్రింక్లర్ యూనిట్లను 100 శాతం సబ్సిడీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పుడు రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూడా మండలంలో మైక్రో ఇరిగేషన్ యూనిట్ల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఏఈవో గంగాజల, ఐకేపీ సీసీ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


దిలావర్‌పూర్‌లో ఆటోడ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 3 : రోడ్డుభద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం దిలావర్‌పూర్ బస్టాండ్‌లో ఆటోడ్రైవర్‌లకు రోడ్డుభద్రత నియమాలపై ఎస్సై యాసిన్ అరాఫత్ అవగాహన కల్పించారు. సైకిల్ నుంచి రాకెట్ నడిపే వారి వరకు అందరూ డ్రైవర్లేనని ఎస్సై అన్నారు. టు వీలర్ నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, మీ కుటుంబానికి మీరు పెద్దదిక్కుగా ఉండాలని చెప్పారు. కార్లు, బస్సులు నడిపేవారు తప్పకుండా సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని, సిగ్నల్ జంప్ చేసి ప్రమాదం కొనితెచ్చుకోవద్దన్నారు. ఎదటి వారు ఎటు నుంచి ఎటు వస్తున్నారో ఎటు వెళ్తున్నారో గమనిస్తూనే డ్రైవింగ్ చేయాలన్నారు. మనపై మన కుటుంబం ఆధారపడి ఉంటుందని డ్రైవింగ్ చేసే ముందు మన కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహన చోదకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ధర్మరక్షణ కోసమే బీజేపీలోకి.. : చైర్మన్

ఉట్నూర్, ఫిబ్రవరి 3: భారత ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ రంగాలను చూడడంతో పాటు ధర్మ రక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని బీజేపీలో చేరుతున్నాని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ ప్రకటించారు. శనివారం పట్టణంలో ర్యాలీ ద్వారా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని రాజ్యాంగం నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరడానికి హైదరాబాద్ వెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో రామాలయం నిర్మాణంతో పాటు ధర్మరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషి శ్లాఘనీయమని అన్నారు. గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల నాయకులతో పాటు జిల్లాలోని పలువురు తనతో బీజేపీలో చేరుతున్నారని అన్నారున. తాను సైతం ధర్మ రక్షణ కోసం అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాని, అందుకే బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. 50 జీపుల ద్వారా వెళ్తున్న కార్యకర్తల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, కొమ్ము రామచందర్, ఉసుక మల్ల దేవిదాస్, దావుల రమేష్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

ముజ్గి మల్లన్న పల్లకీ ఊరేగింపు

భీంపూర్, ఫిబ్రవరి 3: నిర్మల్ జిల్లా ముజిగ చెందిన ముజ్గి మల్లన్న పల్లకీ మండలంలోని పిప్పల్‌కోటిలోకి శనివారం చేరుకుంది. గ్రామస్థులు పల్లకిని స్వాగతం పలికి మల్లన్న పల్లకిని ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో పూజలు చేశారు.

'ఆశా వర్కర్లు అందుబాటులో ఉండాలి'

తాంసి, ఫిబ్రవరి 3: ఆయా గ్రామాలలోని ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిచాలని తాంసి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి తులసీరామ్ అన్నారు. శనివారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్ గ్రామాలలోని ఆశా వర్కర్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఏవైనా వ్యాధులు సోకినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

పీహెచ్‌సీని సందర్శించిన ప్రతినిధులు

నేరడిగొండ, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలో గల స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డాక్టర్ సద్దాంని మర్యాద పూర్వకంగా కలిసి నేరడిగొండ మండలంలో గల గుత్పాల గ్రామంలో అనేక మంది ప్రజలుకిడ్నీ సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని తెలుపడం జరిగింది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దానికి డాక్టర్ స్పందిస్తూ పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తదనంతరం ఆసుపత్రిలో గల రోగులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని , వసతులను పరిశీలించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు ఎన్‌టీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్‌కుమార్, వైద్యులు సద్దాం, సిబ్బంది ఉన్నారు.

'ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి'

బోథ్, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమీర్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. బోథ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని పేర్కొన్నారు. అంతేగాక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇందులో మండల అధ్యక్షుడు మున్సిఫ్ కార్యదర్శులు ప్రేమ్, సురేష్, తదితరులున్నారు.

'మైనర్‌లకు వాహనాలు ఇస్తే కేసులు'

బోథ్, ఫిబ్రవరి 3: వాహనాలు నడిపే వారు తగు జాగ్రత్తలు తీసుకుని నడపాలని లేకుంటే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని బోథ్ ఎస్ఐ బి.రాము పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బోథ్ బస్టాండ్‌లో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్ విద్యార్థులకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాల సంఖ్య ఏటేటా పెరిగిపోతుందన్నారు. తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని ఒకవేళ ఇచ్చినట్లయితే కేసులు తప్పవన్నారు. అంతేగాక ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌ను పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్ల ఎందరో మంది ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని అన్నారు. అదేవిధంగా కారు డ్రైవర్‌లు కూడా తప్పనిసరిగా బెల్టును వినియోగించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసుల్లో ఇరుక్కుంటారని పేర్కొన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను తీసుకు వెళ్లరాదని పేర్కొన్నారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, ముగ్గురు వెళ్లరాదని పేర్కొన్నారు. ఇందులో నాగభూషణం, పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

● కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 3: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని పాలుండిగూడ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ చేనులో జరిగింది. ఎస్సై దుబ్బాక సునీల్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ఉట్నూర్ మండలంలోని చింతకర గ్రామానికి చెందిన సిడాం లక్ష్మణ్, కమలాబాయి దంపతులకు చెందిన వినేష్(22) ఆటో నడుపుతూ కుటుంబీకులకు ఆసరాగా ఉంటున్నాడు. అయితే ఇంద్రవెల్లి మండలంలోని పాలుండిగూడ గ్రామానికి చెందిన ఓ యువతితో గత సంవత్సర కాలంగా పరిచయం ఏర్పడింది. పెళ్లి విషయంలో వినేష్ కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పుడప్పుడు పాలుండిగూడకు వెళ్లి ప్రేమిస్తున్న యువతిని కలిసేవాడు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి కూడా పాలుండిగూడ గ్రామంలో ఉంటున్న తమ దగ్గర బంధువుల ఇంటికి వెళ్లి ఉన్నాడు. రాత్రి బహిర్భూమికి వెళ్తానని బంధువులకు చెప్పి బయటకు వచ్చిన వినేష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులైన గజానంద్, కేశావ్‌లు గ్రామం సమీపంలో ఉన్న వ్యవసాయ చేన్‌లో గాలిస్తుండగా బరద్వల్ బహుదూరసింగ్, వ్యవసాయ చేనులో స్పృహ కోల్పోయి వినేష్ కనిపించాడు. వెంటనే ఇంటికి తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై శనివారం ఉదయం పాలుండిగూడ గ్రామాన్ని సందర్శించి యువకుడు వినేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తమ కొడుకు మృతిపై అనుమానం ఉందని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 3: ఇచ్చోడలోని ఆదిలాబాదు బైపాస్ వద్ద ఉదయం ఐదుగంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంగటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల మేరకు అమరావతి నుండి కేరళకు సంతర పండ్ల లోడ్‌తో వెళ్తున్న మినీలారి ఇచ్చోడ బైపాస్ వద్ద గుర్తుతెలియని వాహణాన్ని ఎటువంటి గుర్తులు పెట్టకుండా నిలిపి ఉంచారని, అది గమనించని డ్రైవర్ వాహణంను డీ కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాని వారిని రిమ్స్‌కు తరలించగ చికిత్స పొందుతూ మర ణించాడని తెలిపారు. మృతుని తమ్ముని పిరాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులేరి?

● భీంపూర్ మండలంలోని కొన్నిచోట్ల పాఠశాలలో ఎక్కువ మంది.. మరికొన్ని పాఠశాలల్లో తక్కువ మంది

● ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల అభ్యాసన, సామర్థ్యాల పెంపు ఎలా !?

భీంపూర్, ఫిబ్రవరి 3: ప్రభుత్వాలు పేదలకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నామని పదే పదే జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. అయితే అధికారుల మాటలకు వాస్తవిక పరిస్థితులకు పొంతనలేకుండా ఉంది. విద్యార్థులు ఉంటే ఉపాధ్యాయులు ఉండరు. విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్న వసతులు లేని కారణంగా ప్రభుత్వ



అంతర్‌గాం పాఠశాలలో మూడు తరగతుల విద్యార్థులకు ఒకేచోట బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకాంత్

విద్య సక్రమంగా అందడం లేదు. భీంపూర్ మండలం వడూర్ పాఠశాలలో 90 మందికి విద్యార్థులకు గాను రెండు ఉపాధ్యాయులు, అంతర్ గాం పాఠశాలల్లో 81 మంది విద్యార్థులకు గాను రెండు ఉపాధ్యాయులతో విద్యను బోధిస్తున్నారు. దీంతో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇప్పటికే సర్కారు బడులపై తల్లిదండ్రులకు నమ్మకం లేక ప్రైవేట్ పాఠశాలలో చేర్పిస్తున్నారు. కాని గ్రామాల్లో కడు పేదరిక కుటుంబ పిల్లలు సర్కారు విద్యపైననే ఆశలు పెట్టుకుంటారు. అయితే వారికి సరిపడిన ఉపాధ్యాయులు ఇతర సౌకర్యాలు లేక చదువుల్లో వెనుకంజ పడుతున్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన బోధన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ పాలిస్తున్న ప్రభుత్వాలు పేద విద్యార్థులకు ఆ దిశగా సౌకర్యాలు కల్పిస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మారుతున్న పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్య ప్రమాణాలు అందుకుంటే పేద విద్యార్థులు చదువుల్లో ఎలా రాణించగలుగుతారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా మండల అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల కొరతను సర్దుబాటు చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చూడాలని వారి తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, ఫిబ్రవరి 3: ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన విద్య బోధనను అందించడం జరుగుతుందని, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే చేరాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళశాల అధ్యాపకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. బాలురు, బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ యేడది నుంచి ఎన్‌సీసీ కోర్సులు కూడా ఉంటాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితం విడుదల కాగానే డిగ్రీ కళాశాలలకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మచ్చస్వామి, అధ్యాపకులు డాక్టర్ సంగీత, శ్రావణి, శ్రీదరదేవి, రవీందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, జావిద్, చరణ్, హంసరాజ్, తదితరులున్నారు.

విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

బోథ్, ఫిబ్రవరి 3: మండలంలోని కౌటా(బి)లో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో కనుగుట్ట, పొచ్చెర, కౌటా(బి) ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ప్రముఖ పోటీ పరీక్షల నిపుణుడు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్, గొడిసెలలు పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శశిధర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు గంగాధర్, వివేకానంద యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 3: గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని వడూర్ గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించేలా చూస్తానన్నారు. అంతకుముందు గ్రామస్థులు ఆయనను ఘనంగా స్వాగతం పలికారు. ఇందులో గాదెశంకర్, ఫయ్యాజ్, హుస్సేన్, రమేష్, ఎంపీపీ రాథోడ్ సజన్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, అనిల్‌యాదవ్, నానక్‌సింగ్‌లు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. పాఠవాలలు బయోసైన్స్ ఉపాధ్యాయుడు లేడని విద్యార్థులు కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే నియమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్లు లేవని ప్రధానోపాధ్యాయులు పద్మ తెలుపగా.. త్వరలోనే నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీలు రాథోడ్‌సజన్, ప్రీతంరెడ్డి, నానక్‌సింగ్, ప్రతాప్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: ఇచ్చోడ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, శాదీముబారక్ చెక్కులను బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తయినప్పటికి ఆరు గ్యారంటీలను అమలుపర్చడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయడంలేదని విమర్శించారు. ఇందులో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి



కోతకు సిద్దంగా ఉన్న వెల్లుల్లి

● రూ.500కు చేరిన కిలో ధర
● పక్షం రోజుల వ్యవధిలో మూడింతలు పెరిగిన ధర
● తుఫాన్ ప్రభావంతో మధ్యప్రదేశ్‌లో తగ్గిన పంట

భైంసా, ఫిబ్రవరి 3 : నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ అమాంతంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కూరగాయలతో పాటు బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మండిపోతున్నాయి. మొన్నటి వరకు ఆకాశన్నంటిన ఉల్లి ధరలు ఇప్పుడిప్పుడే నేలకు దిగివస్తున్నాయి. తాజాగా వెల్లుల్లి ధరలు ఒక్కసారిగా పెరుగుదల బాట పట్టాయి. సంక్రాంతి పండుగకు ముందు వరకు కిలోవెల్లుల్లి ధర రూ.150 నుంచి రూ.170 వరకు ఉండగా ప్రస్తుతం రూ.500లకు ఎగబాకింది. పక్షం రోజుల వ్యవధిలో వెల్లుల్లి ధరలు పై పైకి ఎగబాకి మూడింతలకు చేరుకున్నాయి. పెరిగిన వెల్లుల్లి ధరలు పేద,మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందిగా మారాయి. వెజ్,నాన్ వెజ్‌కూరల్లో వెల్లుల్లి వేస్తేనే రుచికరంగా ఉంటాయి. కూర ఏదైనా సరే అందులో తప్పకుండా వెల్లుల్లి వేయాల్సిందే. అంతటి ప్రాధాన్యత గల వాటి ధర ఆకాశన్నంటడంతో కూరలో వెల్లుల్లిని వేయాలంటే జనం జంకే పరిస్థితులు నెలకొన్నాయి.

● మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి

వెల్లుల్లి మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ మీదుగా జిల్లాకు దిగుమతి అవుతుంది. నిర్మల్, భైంసా, ఖానాపూర్ తదితర ప్రధాన కేంద్రాలకు నాందేడ్ జిల్లా కేంద్రంలోని హోల్‌సేల్ మార్కెట్ నుంచి వెల్లుల్లి సరఫరా జరుగుతుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గత నెలన్నర రోజుల క్రితం తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల మూలంగా వెల్లుల్లి పంట బాగ దెబ్బతింది. అక్కడి రైతులు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటను తొలగించి కొత్తగా మళ్లీ పంట వేసారు. దీంతో గడ్డ చేతికి రావడానికి మరో నెలన్నర నుంచి రెండు నెలల వరకు సమయం పట్టే పరిస్థితులు నెలకొన్నాయి. పాత వెల్లుల్లి నిల్వలు నిండుకుపోవడం, కొత్త దిగుబడులు అనుకున్న మేర లేకపోవడం కారణంగా సమస్య ఏర్పడింది. డిమాండ్‌కు అనుగుణంగా దిగుబడులు లేక సరఫరా తగ్గిపోయింది. ఈ క్రమంలో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. పక్షం రోజుల వ్యవధిలోనే ధరలు మూడింతలు పెరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. మరో నెలన్నర రోజుల వరకు ధరలు ఇదే విధంగా కొనసాగే పరిస్థితులు నెలకొని ఉన్నాయని స్థానిక హోల్‌సేల్ వ్యాపారులు పేర్కొంటున్నారు.

పారిశ్రామిక గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న పారిశ్రామిక గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న పిలుపునిచ్చారు. శనివారం దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ... ఫిబ్రవరి 16న జరిగే కార్మిక రైతు సమ్మెలో కార్మికులందరూ పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలన్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం దేశంలో అనుసరిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా ప్రజల జీవనాధాయం పడిపోయి పేదల సంఖ్య పెరిగిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కే. రాజు, కే. రాజన్న, శ్యామ్ రావు, చిన్నయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లో మాట్లాడుతున్న రాజన్న

పీవీటీజీ రైతులు కొత్త పోడు పట్టాలకు క్రాప్ లోన్ దరఖాస్తు చేసుకోవాలి

పెంబి, ఫిబ్రవరి 3 : మండలంలోని పీవీటీజీ గిరిజన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని పథకాల లబ్ధి చేరవేయుట లక్ష్యంగా మండలంలో ప్రధానమంత్రి జన్‌మన్ యోజన క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన కొత్త పోడు పట్టలు పొందిన పీవీటీజీ రైతులు ఎవరైనా క్రాప్ లోన్ తీసుకోనట్లయితే ఈ నెల 12 శుక్రవారం పెంబి రైతువేదికలో ఉదయం 10 గంటల నుండి నిర్వహించే ప్రత్యేక క్రాప్ లోన్ మేళాలో పంట రుణం కొరకు పీవీటీజీ రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

పంటరుణం దరఖాస్తు కొరకు వచ్చే రైతులు కలర్ ఫోటోలు, పట్టా పాసుబుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. ఇప్పటి వరకు క్రాప్ లోన్ తీసుకోని పీవీటీజీ రైతులు ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రైతులను కోరారు.

'ఆరు గ్యారెంటీలపై ప్రజలకు ఎలాంటి అపోహలు లేవు'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 3: ఆరు గ్యారెంటీలపై ప్రజలకు ఎలాంటి అపోహలు,అనుమానాలు లేవని, బీఆర్ఎస్ నేతలే పనిగట్టుకుని అపోహలు సృష్టిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డిబోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజాసేవభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ పునర్నిర్మాణ సభ విజయవంతమైందని, పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. తమ ప్రభుత్వంపై, ఆరు గ్యారెంటీల అమలు పై బీఆర్ఎస్ నేతలు అనవసరంగా మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు.



కజ్జర్లలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి

అవగాహనతోనే వ్యాధులను అరికట్టవచ్చు : జిల్లా న్యాయాధికారి

తలమడుగు, ఫిబ్రవరి 3: అవగాహనతోనే వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా న్యాయాధికారి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా లీగల్ సెల్ అథారిటి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగాజిల్లా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధితో ఎవరు బాధపడవద్దని ఆధునిక శాస్త్ర చికిత్సతో క్యాన్సర్ మహామారిని అరికట్టవచ్చు అన్నారు. క్యాన్సర్ బాధితులకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా శాస్త్ర చికిత్స అందిస్తుందన్నారు. మండలంలో తొమ్మిది మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు ఉన్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడంజరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఇందులో ఐపీడీజే డాక్టర్ శివరాంప్రసాద్, లీగర్స్ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో రమాకాంత్, వైద్యాధికారి డా.హరీస్, వైద్య సిబ్బంది, గ్రామస్థులు కిరన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

● బోథ్ న్యాయాధికారి బి.హుస్సేన్

బోథ్, ఫిబ్రవరి 3: మార్చి 9 నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ న్యాయాధికారి బి.హుస్సేన్ పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాలత్‌లో సాధ్యమైనంతవరకు క్రిమినల్ కేసులు పరిష్కారం అయ్యే విధాంగా చూడాలని అందుకు పోలీసు అధికారులు చొరవ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపి శ్రీధర్, బోథ్ సిఐ భీమేష్, ఎస్ ఐ రాముతో పాటు ఇచ్చోడ నేరేడుగొండ, బజార్హత్నూర్ సిరికొండ మండలాల ఎస్సైలు కోర్టు కానిస్టేబుళ్లు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

తలమడుగు, ఫిబ్రవరి3: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడుతూ కష్టపడి చదవాలని కోరారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు అందించిన స్థలాలు సూచనలు పాటించే వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం ఖోడద్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, విలాస్‌గౌడ్, ఉపాధ్యాయ దంపతులు పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జి.వెంకట్‌రావ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ గంగన్న, కృష్ణకుమారి, మేడం, విలాస్‌గౌడ్, రామకృష్ణ గౌడ్, లలిత ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో

అప్రమత్తంగా వ్యవహరించాలి

● చీఫ్ కమాండర్ ఇన్స్‌పెక్టర్ పింటూ నంది






విపత్తు నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భైంసా, ఫిబ్రవరి 3 : ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్‌డీఆర్ఎఫ్ 12వ బెటాలియన్ చీఫ్ కమాండర్ ఇన్స్‌పెక్టర్ పింటూ నంది సూచించారు. శనివారం భైంసా పట్టణంలోని వికాస్ హైస్కూల్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వైపరిత్యాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అపత్కాల సమయంలో ప్రాణరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వైపరిత్యాలలో గాయపడిన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్స ప్రమాదం నుంచి రక్షించాల్సిన విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. వరదల్లో చిక్కుకున్న బాధితులు వ్యవహరించాల్సిన తీరు, వారిని కాపాడేందుకు అవలంభించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.ఇందులో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అర్‌డీవో కోమల్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్‌లతో పాటు పోలీసు, ఫైర్ ,రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు , పట్టణ పరిధిలోని వివిధ కాలనీలవాసులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3, కనిష్ఠం 16.8



ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 4 ఫిబ్రవరి 2024

'తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు'

ఆదిలాబాద్అర్బన్, జనవరి 3: రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలున్న ప్రాంతాలపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని లాండసాంగి, పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




● పొలంను దమ్ము చేస్తున్న రైతు(ఫైల్)



ఎస్సీ, ఎస్టీలకే.. తొలి ప్రాధాన్యం





- జిల్లాలో రైతుబంధు పథకం అమలు ముందుగా దళిత, గిరిజన రైతులకే..
- పెట్టుబడి సహాయం చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం
- మూడు ఎకరాల పరిమితి వరకే నగదు జమ
- నెల రోజులకు పైగా కొనసాగుతున్న రైతుబంధు నగదు బదిలీ
- మించిపోతున్న యాసంగి సీజన్ పంటల సాగు
- పూర్తిస్థాయిలో అందని పెట్టుబడి సహాయం.. ఆందోళనలో అన్నదాతలు
- జిల్లావ్యాప్తంగా మొత్తం లక్షా 64వేల 124 మంది రైతులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతుబంధు పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకే తొలి ప్రాధాన్యతనిస్తోంది. ఆ తర్వాత బీసీ, ఓసీ, మైనార్టీ, ఇతర రైతుల ఖాతాల్లోకి నగదును బదిలీ చేస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుబంధు పథకానికి కొన్ని మార్పులు, చేర్పులు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా కాకుండా.. ఈసారి రైతుల సామాజికవర్గాన్ని బట్టి పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మూడు ఎకరాల వరకు పెట్టుబడి సహాయాన్ని అందించారు. అయితే యాసంగి పంటల సాగుకు సమయం మించిపోతున్నా.. ఇంకా పూర్తిస్థాయిలో పెట్టుబడి సహాయం అందకపోవడంపై అన్నదాతలు ఆందోళన కు గురవుతున్నారు. జిల్లాలో మొత్తం లక్షా 64 వేల 124 మంది రైతులు ఉన్నారు. వీరికి రూ.286,69,44,941 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఇందులో లక్షా 9వేల 328 మంది రైతు ఖాతాల వివరాలను ట్రేజరికి పంపించారు. దీనికి సంబంధించిన రూ.123 కోట్ల 09,60,717 నిధులను విడుదల చేశారు. కానీ ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 67,976 మంది రైతులకు మాత్రమే రూ.57కోట్ల 04లక్షల 4వేల 178ల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగితా రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. డిసెంబర్ 11 నుంచి ప్రారంభమైన రైతుబంధు పంపిణీ ప్రక్రియ నెల రోజులకు పైగా కొనసాగుతూనే ఉందని రైతులు పేర్కొంటున్నారు.

రైతుల ఆర్థిక పరిస్థితిని బట్టి..

రైతుల ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకుంటూ ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తుంది. జిల్లాలో మొత్తం రైతులు లక్షా 64వేల 124 మంది ఉన్నారు. ఇందులో 15,660 మంది ఎస్సీ రైతులు ఉండగా వీరికి రూ.21కోట్ల 59లక్షల 844 నిధులు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. అలాగే 73,743 మంది ఎస్టీ రైతులు ఉండ గా.. వీరికి రూ.136కోట్ల 61లక్షల 13వేల 862 నిధులు, ఇతరులు 74,721 మంది రైతులు ఉండగా.. వీరికి రూ.128కోట్ల 49లక్షల 30వేల 235 నిధులను కేటాయించారు. ఇప్పటి వరకు మూడు ఎకరాల భూమిని కలిగిన రైతులకు మాత్రమే రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయం అందింది. ఇందులో మొదట ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యతనిచ్చి.. ఆ తర్వాత బీసీ, ఓసీ, మైనార్టీ, ఇతర రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారు. అంటే మూడు ఎకరాల పరిమితిని తీసుకుంటే మొదట ఎస్సీ, ఎస్టీ రైతులకు చెల్లింపులు పూర్తి చేసిన తర్వాతనే.. ఇతర రైతుల ఖాతాల్లో నగదును జమ చేయడం ప్రారంభిస్తున్నారు. గతంలో రైతుబంధు నగదు పంపిణీ ప్రారంభించిన పక్షం రోజుల్లోనే భూమిని కలిగి ఉన్న రైతులందరికీ నగదు చెల్లింపులు పూర్తయ్యేవి. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల సామాజికవర్గం, రైతుల ఆర్థిక పరిస్థితులను బట్టి నగదు జమలో ప్రాధాన్యతను ఇవ్వడం కనిపిస్తుంది. అలాగే పంట రుణాలను రెన్యూవల్ చేసుకోని రైతుల ఖాతాలను బ్యాంకర్లు ఫ్రీజింగ్ చేస్తూ నగదు చెల్లింపులను నిలిపి వేయడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మూడు ఎకరాలు దాటలే..

ఎలాంటి పరిమితులు, షరతులు లేకుండా రైతుబంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. మొదట చిన్నసన్నకారు రైతులకు గుంట భూమిని మొదలుకొని పెట్టుబడి సహాయాన్ని అందిస్తోంది. ఆ తర్వాత ఎకరాలలో భూమిని కలిగిన రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తుంది. డిసెంబర్ 11 నుంచి రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న ఇప్పటి వరకు మూడు ఎకరాల పరిమితిని దాటలేదు. మొత్తం లక్షా 64వేల 124 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 67,976 మందికి మాత్రమే పెట్టుబడి సహాయాన్ని చెల్లించారు. మిగితా 96,148 మంది రైతులకు పెట్టుబడి సహాయం అందాల్సి ఉంది. ఇప్పటికే జనవరి మాసం ముగిసిపోయినా.. పూర్తిస్థాయిలో రైతుబంధు చెల్లింపులు జరుగడం లేదు. పంటల సాగుకు అదును దాటిపోవడంతో రైతులు గత్యంతరం లేక అప్పు చేసుకుని పంటలను సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుబంధు పథకంపై ఎన్నో అనుమానాలు, అపోహలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. ఎకరాన యేడాదికి రూ.15వేల పెట్టుబడి సహాయాన్ని అందిస్తామని చెప్పినా.. అదికూడా ప్రస్తుతం అమలుకు నోచుకోవడం లేదంటున్నారు.

నగదు జమ అయినా.. డబ్బులు ఇవ్వడం లేదు

: ముక్కెర పుష్ప, మహిళా రైతు, ఆదిలాబాద్



నాకు మూడు ఎకరాల పట్టా భూమి ఉంది. ఎప్పటి మాదిరిగానే యాసంగికి సంబంధించి ప్రభుత్వం అందించే పెట్టుబడి సహాయం నా బ్యాంకు ఖాతాలో రెండు రోజుల క్రితమే జమ అయ్యింది. మెసేజ్ రావడంతో బ్యాంకుకు వెళ్తే ఖాతా ఫ్రిజింగ్‌లో ఉందని చెబుతున్నారు. పంట రుణాన్ని రెన్యూవల్ చేసుకోక పోవడంతోనే నగదును నిలిపి వేసినట్లు చెబుతున్నారు. పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ఉద్దేశంతోనే ఈ యేడు రెన్యూవల్ చేసుకోలేదు. అయినా ప్రభుత్వం అందించే పెట్టుబడి సహాయాన్ని బ్యాంకు అధికారులు నిలిపివేయడం సరైంది కాదు.

సంక్షిప్త సమాచారం



పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వికాసంలో ఆరోగ్య పరీక్షలు

ఉట్నూర్, ఫిబ్రవరి 3: మండలకేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న వికాసం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పాఠశాలలో 70 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ ప్రత్యేక శిబిరానికి ఉట్నూర్ ఇంద్రవెల్లి, ఇచ్చోడ మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను వారి వారి తల్లిదండ్రులు తీసుకువచ్చారు.వినికిడిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి రూ.70వేల విలువగల వినికిడి యంత్రాలను అవసరం అయిన వారికి ఉచితంగా ఇవ్వడానికి ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వినికిడి యంత్రాలు అందుబాటులోకి వస్తాయని భావించి సంస్థ సహకారంతో వికాసం పాఠశాలలో ఈ శిబిరం నిర్వహించామని వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వికాసం పాఠశాలలో చెవిటి, మూగ, అందులు, మానసిక వికలాంగులను చేర్చుకుని వారి సంరక్షణతో పాటు విద్య అందిస్తున్నామని చేశారు. ఈ కార్యక్రమంలో మెస్రం కేశవ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లా సదస్సు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 3: కేంద్ర కార్మిక సంఘాలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను, గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని ఈనెల 4న టీఎన్జీవోస్ హోంలో కేంద్ర కార్మిక సంఘాలు రైతు సంఘాలు జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ హాజరవుతున్నారన్నారు. కార్మికులు, రైతులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు కావస్తుందని, కార్మికులకు, రైతులకు ఇప్పటి వరకు చేసింది ఏమి లేదని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను దిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల కార్మికులు, రైతులు ప్రతి ఇంటికి వెళ్లి క్యాంపెయన్ చేయాలని కరపత్రాన్ని పంపిణీ చేయాలని కోరారు. ఈనెల 16 కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలన్నారు.

వాగ్ధారిలో వాలీబాల్ పోటీలు

నేరడిగొండ, ఫిబ్రవరి3: మండలంలోని వాగ్ధారి గ్రామంలో బంజారా ఉషోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ క్రీడా పోటీలు రెండు రోజుల పాటు ఈనెల 5, 6వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల వాలీబాల్ క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.301 చెల్లించి పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి రూ.16 వేలు రెండవ బహుమతి రూ.8వేలు గెలుపొంది బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ చేతుల మీదుగా ప్రైజ్ సొంతం చేసుకోవచ్చుని వారు పేర్కొన్నారు. ఆటలో ఎంపాయర్ నిర్ణయమే తుది నిర్ణయమని, మిగితా సమాచారం కోసం ఫోన్ నెం.8985477016, 7093331404, 6302994521 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ● పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్అర్బన్, ఫిబ్రవరి3:రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రత్యేక అధికారుల పాలన ద్వారా అమలు చేయడంజరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులకు గ్రామ పంచాయతీల అభివృద్ధి పై హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని సమీక్షించారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఇందులో భాగంగా ప్రత్యేక అధికారుల పాలన ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పూర్తి స్థాయిలో తాగునీరు అందించడంతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీన సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినందున జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 2 నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులను సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేసే విధంగా బాధ్యతలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించి ప్రణాళిక బద్ధంగా గ్రామీణ నీటి సరఫరా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడం జరుగుతుందని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, నర్సరీ, మొక్కల సంరక్షణ, డంపింగ్‌యార్డుల నిర్వాహణ, వైకుంఠదామాల అభివృద్ధి పై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలుతీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఈ నెల 7 నుంచి 15 వరకు గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్‌మహాతో , జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క)


పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

గుడిహత్నూర్, ఫిబ్రవరి 3: విద్యార్థులు కష్టపడి చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో ప్రణీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శంచారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జీవితంలో పదవ తరగతి తొలిమెట్టు లాంటిదని విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ గ్రేట్ సాధించేలా బోధించాలన్నారు. విద్యార్థులు అత్యధిక జీపీఏ 10/10 సాధించే మెలకువలు తెలుసుకోవాలన్నారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో భయం ఆందోళన లేకుండా ధైర్యంతో పరీక్షలు రాయలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని నిర్వహకులు ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో వెంట హెచ్‌ఎం దేవదాస్, తదితరులు ఉన్నారు.

● 'ఇష్టంతో కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు'

తాంసి: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడు మంచి ఫలితాలు సాధిస్తారని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీలలో తాంసి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు గెలుపొందారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం గెలుపొందిన బాలికలకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన బాలికలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, వెంకట్, తదితరలు ఉన్నారు.



గుడిహత్నూర్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో ప్రణీత



తాంసిలో గెలుపొందిన విద్యార్థినులకు ప్రశంస పత్రాలు అందజేస్తూ..



అమరవీరుల స్తూపానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

అమరవీరుల స్థూపానికి క్షీరాభిషేకం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 3: అమరవీరుల స్థూపం వద్ద ఇటీవల కొంతమంది నాయకులు చెప్పులతో స్థూపం వద్ద ఎక్కి అపవిత్రం చేసినందుకు శనివారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు మాట్లాడుతూ ఆదివాసీల యొక్క సంస్కృతీ, సంప్రదాయాలు.. ఆచార, వ్యవహారాలు చాలా భిన్నంగా ఉంటాయి అన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అమరవీరుల స్థూపం దగ్గర మీటింగ్ పెట్టి అపవిత్రం చేయవద్దని, మళ్లీ ఇలాంటివి పునరావృత్తం కావొద్దని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి అమరవీరుల ఆశయ సాధన కమిటీ చైర్మన్ తోడసం నాగోరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జుగ్నాక్ భారత్, కేస్లాపూర్, రాయిసెంటర్ గితేధార్, కోట్నాక్ బారిక్ రావు, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్ రావ్, తోటి సంఘం నాయకులు మెస్రం జైరాం, ఆదివాసీ యువ నాయకులు దుర్వ ప్రశంత్, ఎర్మ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న జడ్పీ చైర్మన్

బీజేపీలో చేరిన జడ్పీ చైర్మన్ జనార్ధన్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి మరోషాక్ తగిలింది. జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్ శనివారం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. గత కొంతకాలంగా జడ్పీ చైర్మన్ బీఆర్ఎస్‌ను వీడుతారన్న ప్రచారం జోరుగా సాగింది. గత పక్షం రోజుల క్రితమే ఆయన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు హైదరాబాద్ సైతం వెళ్లారు. అయితే కాంగ్రెస్‌లో చేరడం వాయిదా పడడంతో మళ్లీ బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. అనుకున్నట్లుగానే ఆయన వందలాది మంది అనుచరులతో కలిసి బీజేపీ కండువా వేసుకున్నారు. గత జడ్పీటీసీ ఎన్నికల్లో నార్నూర్ జడ్పీటీసీగా గెలుపొందిన రాథోడ్ జనార్ధన్‌కు బీఆర్ఎస్ పార్టీ జడ్పీ చైర్మన్ అవకాశం కల్పించింది. పదవీ కాలం పూర్తికాకముందే పార్టీని వీడడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాథోడ్ జనార్ధన్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పడంతో జడ్పీలో బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య ఐదుకు చేరింది. ఇప్పట్లో ఆయన పదవికి ఎలాంటి ముప్పు లేకపోయినా.. పార్టీ మారడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో ఇద్దరు జడ్పీటీసీలు త్వరలోనే బీజేపీలో చేరే అవకాశం ఉందని తెలుస్తుంది. జడ్పీచైర్మన్ వెంట బీజేపీ పార్టీలో చేరిన వారిలో నార్నూర్, ఉట్నూర్ మండలాలకు సంబంధించిన ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ఇతర నాయకులున్నారు.

5న నాగోబా జాతర ఏర్పాట్లపై సమీక్ష

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 3: ఫిబ్రవరి 9న మెస్రం వంశీయుల మహా పూజలతో ప్రారంభించనున్న కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లపై ఈనెల 5న ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడానికి ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్త ఉత్తర్వులు జారీ చేశారని దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి శనివారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. అయితే, దీనికి సంబంధించి ప్రభుత్వ శాఖల అధికారులు నాగోబా జాతర ఏర్పాటు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని పీవో పేర్కొన్నారు.